# అతకని బ్రతుకులు

సంపత్‌రావు

శేఖరం అలిగి పడుకున్నాడు. మనస్సు పచ్చి పుండులా వుంది. అంతరాల్లో గత స్మృతులు పదును కత్తిలా గుండెను తరిగివేస్తున్నాయి. కన్నీరు వుడికిపోతున్న మెదడును చల్లార్చుతున్నది. గుండెగాయాలు రెచ్చిపోయినప్పుడు, వేడి నిట్టూర్పులలో ఆత్మ పరితాపము చెందినప్పుడు అనుభవమయ్యే వేదన జీవితంలో మరొకప్పుడు లభించదు. మురిగిపోయిన కండరాలను బ్లేడుతో కోసినపుడు కలిగే స్పర్శసుఖంలాంటిదే ఈ ఆత్మవేదన. శేఖరం ఇలా దుఃఖాన్ని వేపరసంలా త్రాగుతూ పడుకున్నాడు గదిలో నిశ్శబ్దత అతనికి మరింత విషా కలిగిస్తున్నది ఎంత ప్రయత్నించినా గత జీవితాన్ని మనసునుండి లాగివేయలేక పోతున్నాడు.

* * *

"ఇక్కడే వుండిపోయి సేద్యం చూసుకుంటాను నాన్నా" తండ్రికి జబ్బుగా వుందని కబురుచేస్తే వచ్చిన శేఖరం దూరభారం ఆలోచించిన మీదటే ఈ మాట అనవలసి వచ్చింది.

కుటుంబం అప్పులపాలై పోయింది. నెమ్మదిగా జరిగినంతకాలం భరోసాగానే వుండిపోయారు అప్పులవాళ్ళు పరిస్థితులు రచ్చకెక్కడంతో కాగిత పత్రాలతో కందిరీగల్లా ముసురుకున్నారు. ఇప్పుడుకాదప్పుడని బండిని లాక్కుపోతున్నాడు తండ్రి. కాని యెంతకాలం? అప్పు ముప్పేగా. చూచే దిక్కులేక సేద్యం కాకులు పొడుస్తున్న టక్క గొడ్డులా వుంది. పరిస్థితినంతా అవగాహన చేసుకున్నాడు శేఖరం. ముసలితనంలో తండ్రిని ఈస్థితిలో వదిలిపెట్టి కాలేజీ చదువు వెలిగిస్తూవున్నందుకు అసహ్యం వేసింది. నిశ్చయాన్ని ప్రకటించి ఊరుకున్నాడు.

కొడుకు మాటలకు సుందరయ్యగారికి ఆశ్చర్యమూ, భయమూ వేసింది. ఆయన తండ్రితాతలు వ్యవసాయంతోనే కుటుంబాన్ని, దర్జాగా పోషించారు. ఆ వ్యవసాయమే ఈనాడు కుటుంబావసరాలను తీర్చలేక కృంగదీసింది. వ్యవసాయంతోపాటు ఇతర వ్యాపకాలు పెట్టుకున్నవాళ్ళు యెందరో బాగుపడ్డారు. ఇవాళతింటే రేపు కడుపుమాడ్చుకున్న వాళ్ళంతా చూస్తుండగానే ఎంతో ముందుకు వెళ్ళిపోయారు. కంట్రాక్టులో వేలకు

వేలు గడిస్తూన్న శంకరయ్యా. రాజకీయ నాయకుడుగా పేరు ప్రఖ్యాతులతో పాటూ ప్రజలకోసం ఆస్తిని పెంచుకుంటూన్న కొమర్రాజూ, చేస్తున్నది చిన్న ఉద్యోగమైనా నేర్పుతో లంచాలు గుంజి ఊళ్ళో అందరికన్నా యెక్కువగా భూవసతి సంపాదించిన సబిన్స్పెక్టరు కనకాంబరం కొంతకాలం క్రితం తనకు చేతులుచాపిన వాళ్ళే. వాస్తవం చెప్పాలంటే రిక్షాడ్రైవర్ పేరిగాడూ, హోటలు సర్వరు మల్లప్పా, కిళ్ళీకొట్టు నాగోజీ, సైకిలుషాప్ పీర్‌సాయెబు, దర్జీపని వీరప్పా తక్కువ హోదాగల వాళ్ళయినా ప్రస్తుతం తమకన్న బాగానే బ్రతుకుతున్నారు. అప్పుల బాధలేకుండా యేరోజుకారోజు నాలుగు డబ్బులు చేతుల్లో ఆడుతున్నవి. వీళ్ళంతా వ్యవసాయమే చేస్తున్నారామరి? నిజంచెప్పాలంటే వ్యవసాయం చేసి చితికిపోయి తరువాత బాగుపడ్డాళ్ళేనయిరి. అందులోను తమ బోటి వంటిచేతిగాళ్ల సేద్యాలు ఈ రోజుల్లో మరీ తీసిపోయినవి ప్రతిచిన్నపనికీ ఇతరులపై ఆధారపడాలి. జీతగాళ్లూ, కూలివాళ్లూ వెనకటిలా విశ్వాసంగా పనిచేయటంలేదు. ఆ రోజుల్లో యజమాని ఇంట్లో దీపం చల్లగావుంటే చాలనుకునేవారు. చేమటోడ్చి పనిచేసి పంటలు పండించేవాళ్లు. యేం కాలమోగాని ప్రజల బుద్ధులు పూర్తిగా మారిపోయాయి. తాము యింట్లో కూర్చుంటే పాలేళ్ళు పొలంలో పడుకుంటారు కసురుకుంటే దులుపుకుపోయి వేరేపని చూసుకుంటారు. తన చిన్నతనంలో సుంకిరి పుల్లిగాడు పనిలోకి సరిగా రావటంలేదని చెప్పుతో నాలుగుతన్ని వెళ్ళగొడితే వాడు అటుతిరిగి ఇటుతిరిగి యేపని చిక్కక చక్కావచ్చి కాళ్ళుపట్టుకుని పనిలోచేరాడు. యిప్పుడయితే అట్లా జరుగుతుందా? దేశమంతా అడ్డదిడ్డమైన పనులు పుట్టుకొచ్చాయి. వ్యవసాయ కూలీలకంటే యితరపనుల వాళ్లకే ఎక్కువ గిట్టుబాటుగా వున్నది. పోయినయేడు తమ గ్రామానికి పంట కోతల కాలంలో కాలువపని వచ్చింది. వాళ్ల రోజుకు రెండు రూపాయిలు ఇస్తామన్నారు. కూలీలంతా అటే విరగబడటంతో సమయానికి కోతలు పూర్తిగాక నానా అవస్థలు పడ్డారు. "ఊళ్ళోపంట పాడుచేస్తారర్రా" అని మొత్తుకుంటే "మీరిచ్చే నాలుగుశేర్లకని రెండు రూపాయిల కూలి పోగొట్టుకుంటామా!" అన్నారు కూలీలంతా. అది నిజమే. కాని తాము రెండురూపాయిలెట్లాయిచ్చి చచ్చేది?

ఇదంతా తన కొడుక్కి తెలిసినట్లులేదు. "రైతే దేశానికి వెన్నెముక, అన్నదాత" అనే కట్టుకథలన్నీ కాగితాల్లో చదివి వుంటాడు. ఈనాడు నికృష్టంగా బ్రతుకుతున్నది రైతేనన్న అనుభవం వాడికిలేదు.

తన కుటుంబం తలమునిగే అప్పుల్లో పడిపోయింది. ఇంకో సంవత్సరం యెలాగో కష్టపడితే కొడుక్కు ఉద్యోగం దొరక్కపోదు. ఈ బండబారిన సేద్యమేదో

215

తను చూసుకోగలడు. రెండుచేతులా సంపాదన కలిసివస్తే తొందరలోనే నలుగుర్లో కలిసిపోవచ్చు. స్థూలంగా సుందరయ్యగారి ఆలోచన ఇది. అందుకే "నీవనుకున్నంత తేలిక గాదురా సేద్యం నాలుగురాళ్లు వచ్చే ఉద్యోగం చూసుకుందువుగానీ," అనకుండా వుండలేకపోయాడు. ఆయన అనుభవానికి గోచరమైన పరిష్కారమార్గం అదే.

తండ్రి మాటలకు శేఖరం నివ్వెరపోయాడు. అతనికి ఉద్యోగమన్నా సంపాదనకోసమే పరిమితమైన నేటి కాలేజీ చదువులన్నా చెడ్డ అసహ్యం. ఉద్యోగాలకోసం కాళ్లకు బలపాలు కట్టుకతిరిగే వాళ్ళని ముఖాన్నే తిట్టిపోసేవాడు. రెండక్షరాలు పొట్టలో పడగానే యే ఆఫీసులోనైనా దొఱబడాలని ఆదుర్దా పడకపోతేయేం. స్వతంత్రంగా జీవించే ఆస్కారం లేదా? జీవితంలో ఆదర్శంగా స్థిరపడిపోయి సమాజంలో మార్పు తేవచ్చునే. ఈ చేతగాని వెధవలంతా నాలుగురాళ్ళకోసం ఆత్మను అమ్మేస్తున్నారు. ఆశయాలనూ, అభిరుచులనూ పొట్టకూటికోసం ఖూనీచేసుకుంటున్నారు. కేవలం ఆత్మసుఖం కోసం అఱ్ఱులు చాస్తున్నారు. ఎగ్జిబిషను బొమ్మల్లా పెళ్ళాలకు అందంగా రంగులువేసి, నాలుగుగోడలమధ్య చెఱబట్టి అనుభవించడం. బ్రతుకును సాధ్యమైనంత తేలికగా గడిపివేయడం, బయటి ప్రపంచాన్ని మనసులోకి రానివ్వకుండా జాగ్రత్త పడడం— శేఖరానికి తగనిమంట.

కాలేజీ విద్యార్థుల జీవితాలు యెంత సంకుచితమో తలుచుకున్నపుడు శేఖరానికి కడుపులో తిప్పేది. వీళ్ళ జీవితాలలో నవీనమైనదీ, విప్లవాత్మకమైనదీ యేమీలేదు. పదిమందితోపాటే చస్తామంటారు. బాధపడటం, త్యాగం చెయ్యడమంటే పెద్దపులిని చూచినంత భయం. తాము నివసిస్తున్నది మానవ ప్రపంచంలోనన్న ధ్యాసేలేదు. ప్రపంచ పరిణామాల గురించి స్టడీచేయరు. ఎవరో గిరిగీసి చూపించిన మార్గమే తప్ప ఇతరత్రా దేనినీ పట్టించుకోరు. ఉల్లాసంగా కాలాన్ని దిగమ్రింగడమే వీళ్ళ జీవిత పరమావధి. యిలా ఆలోచించిన కొద్దీ శే ఖ రా ని కి కాలేజీ జీవితం అసహనమైపోయింది.

శేఖరం ఒక రకమైన మనస్తత్వాన్ని వంటపట్టించుకున్నాడు. సమాజంలో మార్పు నవ వసంతం లాంటిది. నిశ్చింతగా బ్రతకడమంత క్షుద్రమైనది మరొకటి లేదు. ముళ్ళత్రోవలో పయనించాలి. ఆత్మ వేదనలో అభిప్రాయాలను శుభ్రపరచుకోవాలి. ప్రయోజనం కోసం ఎంతటిత్యాగమైనా చేయడానికి సిద్ధంగావుండాలి. అప్పుడే జీవితానికి సార్థకత. ఉద్యోగం చేస్తే ఈ భాగోతమంతా కాల్చి పారేయాల్సిందే. తండ్రితో స్పష్టంగా చెప్పేశాడు.

216

"ఉద్యోగమంటే బానిసబ్రతుకు నాన్నా. పదిమందికి సాయపడుతూ సేద్యం చూసుకోవాలని నిశ్చయించుకున్నాను."

కొడుకు మాటలకు సుందరయ్య మరోలా అభిప్రాయపడ్డాడు ఆయన దృష్టి కోణమువేరు. వయసులో వున్నప్పుడు గ్రామంలో పెత్తనం చలాయించి కొంప లార్చాడు. జనమంతా కన్నుగీటితే కదలివచ్చేవారు. ఇప్పుడు వేరే కుఱ్ఱకుంకలంతా సాగించుకుంటున్నారు. శేఖరం చదువుకున్నవాడు తెలివైనవాడు పదిమందిని గుంపు కట్టి గ్రామంలో భళీ అనిపించుకుంటాడు. తను నిశ్చింతగా వుండొచ్చు. అందుకే శేఖరం నిశ్చయాన్ని వొప్పుకున్నాడు.

భిన్న మనస్తత్వాల మధ్య యిరుక్కుపోయిన ప్రారంభదశను జ్ఞప్తికి తెచ్చుకుని చేదుగా నవ్వుకున్నాడు శేఖరం గతాన్ని త్రివ్వి పోసుకోడంలో మనస్సు తేలిక పడుతూన్నది. లేచి కూర్చుని సిగరెట్టు దమ్ములాగి పొగ వదిలాడు. జీవితాన్ని నెమరు వేసుకోడం ప్రారంభించాడు.

* * *

"ఎల్లుండి మీ తాతయ్యశ్రాద్ధం. సంసారం తెరిపిలేకపోయినయేడు బ్రాహ్మడికి బియ్యమిచ్చి తృప్తిపడ్డాను. ఇప్పుడుకాస్త సంతృప్తిగా జరిపిద్దాం" కొంచెం తమాయించుకుని మళ్ళీ ప్రారంభించాడు సుందరయ్య. "మీతాతంటే మామూలుమనిషారా? బ్రతికినన్నాళ్లూ నెయ్యి కారంగా తిన్నాడు. నాలుగు డబ్బులు జేబులో లేకుండా ఒక నిమిషం వుండలేదు. ఆయనతోనే పోయింది లక్ష్మమ్మోరు ఆదినాలు తల్చుకుంటే మనసు దిగులుపడిపోతుంది." విచారంగా ముగించి తలవంచుకున్నాడు.

శేఖరం ఓపికగా ఆలోచించాడు. ఇది వట్టి ఛాందసం, చనిపోయిన వాళ్ళ పేరు చెప్పుకుని బ్రాహ్మణులతోపాటూ సపరివారసమేతంగా సుష్టుగా మెక్కడంకన్న ప్రయోజనంలేదు. నాన్నగారేమో ఆప్యాయంగా కోరుకుంటున్నారు. ఏమైనా తన లాంటివాడు ఈ అర్థం పర్థం లేనివాటిని ఊరేగిస్తే అవివేకం. మధ్యేమార్గం ఆలోచించి "ఇబ్బందిగావుందినాన్నా. ఈయేడుకూడా పోయిన ఏడాదిలాగానే సాగనంపుదాం. దినాలు బాగాలేవు. ఇట్లాంటివి ఒకటొకటి వదులుకోవడం మంచిది." అన్నాడు

దీంతో ఊహించనంతగా దుమారం రేగింది. "విన్నారర్రోయ్ మాయింటి పెద్ద నిర్వాకం. పెద్దలకు పిండం పారవేయటం కూడా శుద్ధదండుగేనట. ఎంతచెయ్యి తిరక్కపోయినా ఇట్లాంటి కార్యాలంటే మన రోజుల్లో అయితే వెనకాడామా? ఇప్పుడు పెద్దలంటే బొత్తిగా గౌరవం పోయింది ఈ ప్రయోజకులంతా కలిసి

217

అయ్యో—దేనికి పనికిరాకుండా పండుబారి పోయారుకదా ఇంకా బ్రతికి యేం జుఖిస్తుం టారు? తొందరగా ముగింతురూ. "అంటారనటంలో అనుమానంలేదు. వాడేమో మొండిరాత రాసిపెట్టాడు" మొఖాన కొంగు పెట్టుకొని ఊళ్ళోని ముడుగులకంతా యెక్కించి వచ్చాడు తండ్రి.

చావుకు దగ్గర్లో వున్నామనుకున్న వాళ్ళంతా గుంపులు కట్టి సాగదీశారు బ్రతి కుండగానే ఇది జరగనిస్తే హరీమన్న పిదప ఇక తమను కుక్కలుగూడ తలవవు. పెద్దలు ఊరికేనే అన్నారా "పిండాలు పెట్టకపోతే ఆత్మ ఇంటిచుట్టే అరుస్తూ తిరుగు తుంద"ని, అంతా శేఖరానికి తీవ్ర నిరసన తెలిపారు.

ఆరోజు రాత్రి సుందరయ్య భోంచేయలేదు "బుక్కెడు వేస్తే దిగమ్రింగడం కన్న ఈయింట్లో మనచేతిలో ఏమున్నది? నేను బ్రతికుండగానే ముసలాడికి పిడికెడు మెతుకులు లేని గతి పట్టింద"ని ముసల్దానితో వెళ్ళబోసుకున్నాడు. శేఖరం తట్టుకో లేకపోయాడు. అతన్ని ఎవరూ సమర్థించలేదు. మూర్ఖునికింద జమకట్టారు శ్రాద్ధం జరిగిపోయింది. ఎన్నడూ లేనన్ని లాంఛనాలు పెట్టించి దిష్టితీశారు ఆ రోజునుంచీ శేఖరానికి వాస్తవ జీవితంతో పెనగులాట ప్రారంభమయింది.

* * *

కుటుంబ బాధ్యతల్ని నెత్తిన పెట్టుకున్నాక తండ్రిచేసిన అప్పుల్ని లెక్కకట్టి గుండె అదిమి పట్టుకున్నాడు శేఖరం. పదివేలు! ఇంత అప్పు యెందుకు చేసినట్లు? కొందరిలా ఆయన త్రాగుబోతుగాదు. అందరూ ఆయనను మంచివాడుగానేకాక తెలివి గల వాడనికూడా గుర్తించుతారు. అయితే యేం లాభం? గీత గీతేనంటారు. తనతాత బంగారు కడియం చేతికి తొడుక్కొని పీధరుగుపై కూర్చునేవాడు. పదిమంది చేరగానే చొక్కా చేతినిపైకిలాగి ధీమాగా కూర్చునేవాడు. డబ్బున్నవాడిని గౌరవించాలని ఆయన భావన. స్థితి పరదుగానే ఆయన ఆధిక్యతను అందరూ గుర్తించారు ఇది శేఖరం చిన్ననాటి పరిస్థితి. ఇప్పుడంతా తారుమారయ్యింది.

ఒకనాడు బాగా బ్రతికిన కుటుంబాలన్నీ నేడు ఆర్థికంగా పతనమై పోవడానికిగల కారణాలను శేఖరం గ్రహించాడు. వెనుకటి ఆచారాలతోపాటూ నేటి నాగరిక సమా జపు అలవాట్లను విధిగా పాటించడంతో మితిమీరిన అవసరాలు పెరిగి పోయాయి. సమాజ గమనం మారడంవల్ల దొడ్డిదారి ఆదాయాలు బాగా పడిపోయాయి. సొంత ఆదాయంతో సర్దుకుని మంచమున్నంతలో కాళ్ళు ముడుచుకోడానికి పరువు ప్రతిష్ఠలు

గంగపాలైతాయని వాపోతున్నారు. అవసరం కోసం అప్పుచేయడం, అపకీర్తిపాలు కావడం— ఇదీ నేటి మధ్యతరగతి కుటుంబాల స్థితి.

శేఖరం ఇలాంటి విషయాలన్నీ బాగా బోధపరచుకుని పరిష్కార మార్గం ఆలోచించిపెట్టాడు. అతని ఊహ ఇది. కుటుంబాన్ని తన ఆశయాలకు అనుకూలంగా మలచి పెట్టుకోకపోతే జీవితానికి అర్థంలేదు. దండగ ఖర్చులన్నీ తగ్గించాలి, వ్యవసాయాన్ని అభివృద్ధిచేయాలి. అందరూ నేర్చుకొనేలా కుటుంబాన్ని నడుపాలి.

ప్రథమ కర్తవ్యంగా శేఖరం అప్పుకోసం అగచాట్లు పడవలసిన గతి పట్టింది. చేతిలో చిల్లిగవ్వ లేకుండా గడిచేట్లులేదు. ఎక్కడికెళ్ళినా "ఇచ్చింది వస్తేనే పదివేలని" దెప్పికొడుతున్నారు. చివరికి ఓ శెట్టివద్ద దాపరికం లేకుండా వాలకబోసుకున్నాడు తండ్రి చేసిన బాకీ యెడమకు వ్రాసుకున్న శెట్టి యెఱుపెట్టి చేపను గుంజాలనుకున్నాడు. అంతా కలిపియిస్తే అవసరం తీరుస్తానన్నాడు.

శేఖరం అంగీకరించి కాగితం కొత్తచేసి ఊపిరి తీసుకున్నాడు.

శేఖరం ఆశించిన దానికి అంతా భిన్నంగా జరుగుతూన్నది. శ్రద్ధగా పనిచేసి పంటలు కలిసివస్తే అప్పులు సర్దవచ్చుననుకున్నాడు. ఇంట్లో ఎవ్వరూ దీన్నిగురించి ఆలోచించడం లేదు. పోల్లుపోకుండా అన్నీ విధిగా జరిగితీరాలని పంతంవేసి కూర్చొంటున్నారు.

"తిరుపతిపోయి స్వామి దర్శనం చేసుకోవాలనుందిరా శేఖరం" సుందరయ్య అభ్యర్థించాడు. శేఖరానికి పట్టమండి పోయింది. నిన్ననేమో దసరా పండుగనాడు కొత్తబట్టలు లేనిదే జరుగదని పట్టుబట్టి నెగ్గించుకున్నారు. ఇవాళే ఈ భారతం వచ్చి పడింది. ఏది అవసరమో యేది అనవసరమో గుర్తించకుండా ప్రవర్తిస్తున్నాడు తండ్రి. ఆయనకూడా సంసారాన్ని యీది అలసిపోయిన వాడే. మండిపోతున్న గుండెను చల్లార్చుకుని అన్నాడు శేఖరం.

"చూడునాన్నా, మనమా పుట్టెడప్పుల్లో వున్నాం. అవి తీర్చుకోనిదే దివ్యం కూడా పుట్టదు. నీకు తెలియందేముంది?" నచ్చచెప్పానని సంతోషించాడు శేఖరం. అది తనకు గర్వకారణమని మురిసిపడ్డాడు. కాని వెంటనే అదిరిపడ్డాడు.

"ఏదో ముసలివాడు బ్రతికినన్నాళ్ళు బ్రతుకుతాడా? "యెప్పుడూ ఈ జంజాటమేనాయె. స్వామిదర్శనం చేసుకుంటాడట. కాదనకు" అన్నాడు కోడెల్లాంటి కొడుకుల తండ్రి.

ఈ ముసలాళ్ళంతా కలసి కట్టుగా యెందుకు వాదిస్తారో శేఖరానికి తెలుసు. యే కొడుకు తండ్రిపాటకు తాళం కొట్టకపోయినా తొందముదిరి ఊసరవెల్లి అవుతూందనీ, బోసినోటి కోరికలన్నీ చంపుకోవలసి వస్తుందనీ వీళ్ళకుతెలుసు. అందుకే అయినదానికీ కానిదానికీ ఒకరికొకరు సాయమై కొడుకులను సాధించుకుంటారు తమతద్దినాలు తెల్లవార్చడానికే కొడుకులను కన్నామని వీరి ఉద్దేశము. ఇలా తేల్చేసుకుని శేఖరం కస్సుమన్నాడు కాని యేంలాభం? తంటెర్రి వాదనముందు తను నిలువలేదు. ఆయన తల్చుకున్నది జరిగితీరాల్సిందే. ఆయనట్లా బ్రతికాడు.

* * *

"ఈ మాసంలో అక్కయ్యకు సారె పెట్టాలి. ముందు ముహూర్తాలు లేవని శాస్త్రిలు చెప్పాడు" అన్నంతోపాటు ఇదికూడా వడ్డించింది తల్లి. శేఖరానికి ఏమనాలో తోచలేదు. అంటే మాత్రం ఏమి ఆగుతున్నది? తను నిమిత్తమాత్రుడు. ఫలితం ఏమైనా ఉద్దేశం బయటపడితే మనసుకన్నా ఊరట కలుగుతుంది.

"అమ్మా ఈ సంవత్సరానికి వాయిదా వెయ్యకూడదే" అన్నాడు సమయం కోరుతూ శేఖరం.

"ఆఁ! అవేం మాటలురా. శుభమా అని అది మన ఇంటికివస్తే జానెడు రవికగుడ్డయినా పెట్టకుండా వెళ్ళగొడితే నలుగురేమనుకుంటారు? దిక్కులేనిదై మనింటికి వచ్చిందా? దానిది గంపంత సంసారం. చుట్టరికం వదలుకుంటామా పిల్లలున్నచోట' అత్యవసరమూ, అతి ముఖ్యమూ, సంసారగతమైన ఆచారాలన్నీ ఏకరువు పెట్టింది.

శేఖరం తల్లి ఏం చేయదలచుకున్నా చేసికాని ఊరుకుంటుంది ఆమె తెచ్చే వాదనలన్నీ సాంప్రదాయ సిద్ధంగా నిర్దేశించబడిన నిబంధనలు. వాటిముందు తన విధానాలు గడ్డిపోచకన్న కనాకష్టమైనవి, నోరు కదపలేకపోయాడు.

ఆ సాయంత్రం శేఖరం పొలంవైపు వెళ్ళి యింటికొస్తున్నాడు పక్కింటిముందు పొరుగింటి అమ్మలక్కలంతా సమావేశమై చెవులు కొరుక్కుంటున్నారు. తన్నుచూచి మూతివిరిచి ముక్కుమీదవేలు వేసుకున్నారు. మధ్యతరగతి కుటుంబాల్లో ఈ అమ్మలక్కలది ప్రత్యేకమైన పాత్ర. గాలి కబుర్లకు తోకలు తొడిమలు చేర్చి సుయ్‌మంటే రోకటి పాటగా అందుకుంటారు. ఆనోటా ఆనోటా అది తొలుత ప్రారంభించిన వాళ్ళకే తెలియనంతటి రూపం సంతరించుకుంటుంది. పడుచువాళ్లో పెడకటింటి గుసగుసలు, మెతకబడిపోయిన ముత్తైదువుల మొగళ్ల చీకట్లో మిడికివచ్చిన ముండల మర్మస్థానాలు,

ముసలి మొగుళ్ళ సరసాలు, గోప్యంగా మాట్లాడుకున్న కుటుంబ విషయాలు అన్నీ వాళ్ల చర్చలతో వీధికెక్కవలసిందే.

“ఆడపిల్లయిం తర్వాత సారెచీరె ఆశపడకుండా వుంటుందర్రా— చోద్యం కాక పోతే” అన్నది, ముసలి మొగవి పేరుమీదుగా పిల్లల్నికని వ్యామోహాన్ని చల్లార్చు కుంటూన్న ఒకామె. వెంటనే మరొకామె అందుకొని “పాడుబుద్ధులు’ అన్నది— అల్లుణ్ణి మరిగి బిడ్డకు విషం పెట్టిన ఉత్తమ ఇల్లాలు.

వీళ్ల జీవితాల్లోపలి కుళ్ళంతా తనకు తెలుసు చెడామడా నాలుగు వడ్డిద్దామనుకు న్నాడు అయినా వీళ్ళదేం తప్పు? తల్లి ఊదందే ఈగోల పుట్టలేదుగదా. సంబాళించు కుని ఊరుకున్నాడు.

* * *

“అంతాకలిసి వచ్చిందిరా శేఖరం, నాన్న దైవదర్శనం చేసుకుని వచ్చాడు. చుట్టపక్కాలను పిలిపించి తీర్థపూజచేస్తే ఖర్చు వెళ్ళిపోతుంది” ఇంట్లోకి కాలుపెట్టగానే కాపురం చేయటంలోవున్న సుఖవును బోధించింది అక్కయ్య.

“మహబాగా చెప్పావే తల్లీ. అంతమాత్రం తెలియందే అవలీలగా పెట్టుకొస్తు న్నావా కాపురాన్ని” తాళం వేసింది తల్లి. శేఖరానికి వళ్లుస్వాధీనం తప్పిపోయింది. అంతా మనుష్యుల్ని పీక్కుతినే దయ్యాల్లా కనిపించారు. “కట్టకట్టుకుని గంగలో దూకి చావండి. పీడవిరగడైపోతుంది” అన్నాడు ఉక్రోషంగా.

ఇంకేం. ఇంట్లొ గంద్రగోళం లేచింది, తల్లీబిడ్డా ఒకళ్ల నొకళ్ళు పట్టుకుని ఏడ్చారు. “మేముండగానే ఇంట్లొ నీకీగతిపట్టిందే తల్లీ తర్వాత నిన్ను మందలించే దిక్కుండదు, అంతా వాళ్ల ఆటైపోతుంది.”

శేఖరానికి ఏడుపొచ్చింది. గదిలోకెళ్లి ఎవరూ చూడకుండా వెక్కి వెక్కి ఏడ్చాడు ఈ లంపటం ఎందుకు తగిలించుకున్నానని బాధపడ్డాడు. ఇక వీళ్ళమధ్య తన వ్యక్తిత్వాన్ని కాపాడుకోలేదు.

అంతా సవ్యంగానే జరిగిపోయింది. దిమ్మువదిలించి చుట్టపక్కాలు వెళ్ళిపో యారు. శేఖరం పిచ్చివానిలా చూశాదేకాని దేన్నీ అపలేక పోయాడు.

* * *

“ఇన్ని దండుగలు తెల్లార్చుకున్నారు గదా ఎన్నాళ్లనుంచో అడుగుతుంటే ఒక పట్టుచీర తెచ్చిపెట్టారూ? అన్నది పెళ్ళాం. ఆకోరిక తీర్చనిదే శరీరంపై ఎవరికీ హక్కు లేదన్నట్లు నసుగుతూ.

పెళ్ళాం ప్రక్కలో పడుకున్న శేఖరానికి సోమిశెట్టి జ్ఞప్తికిరాగానే చివుక్కుమనిపించింది. కళ్ళల్లో నీళ్లుతిరిగాయి. పెళ్ళాం అంటే జీవితాన్ని ముందుకు సాగనివ్వకుండా జుట్టుపట్టికుని లాగేదేనని దృఢపరచుకున్నాడు. అయినా కావుపట్టిన ప్రతిమగాడూ ఆడదానిని ఎందుకు ముడిపెట్టుకుంటాడో అర్థంకాలేదు. ఈరకం మగాళ్ళంతా బ్రతుకును కుందించుకునేందుకే తాపత్రియ పడతారు. బహు ముఖంగా వ్యాపిస్తే దేన్నీ అందుకోలేక హైరానైపోతామని ముడిసివున్నచోటే కూర్చుంటారు.

ఆరోజు సోమిశెట్టి తాడోపేడో తేల్చుకోనిదే లేవనని పట్టేసుకుని కూర్చున్నాడు రెండు జాములైనా కదల్లేదు. దుప్పటి పరుచుకుని వాకిట్లో పడుకున్నాడు.

"ఇవ్వలేకపోతే అప్పులేమని చెప్పి కాగితాలు తీసుకోండి" అన్నాడు సోమిశెట్టి.

దాంతో శేఖరం తండ్రికి జన్మగతమైన ఆగ్రహం కలిగింది— "మా పెద్దలు మీ పెద్దల కప్పు పెట్టర్రా. యిచ్చిన వాళ్లకు యిరువయ్యోకటో వేలు చూపెట్టడమంటే ఏమిటో మీ నాన్ననడిగి తెలుసుకో. ఎంత పుచ్చినా ధన్యాలకన్న జొన్నలు బరువే" మాతాత నెయ్యి తాగాడు— కావలిస్తే మూతివాసన చూసుకోమన్నట్లు సుందరయ్య అన్నాడు.

"మెడపట్టి గెంటినా జరిగేదిలేదు. ఇచ్చినాసరే మెచ్చినా సరే" సోమిశెట్టి మరీ భీష్మించాడు.

సముదాయించి పంపిద్దామని శేఖరం జోక్యం కలిగించుకుని అన్నాడు. "ఇన్నాళ్లు ఓపిక పట్టావు. ఈ నాల్గురోజు లాగుతే పంటలపై తీరుస్తాను".

"ఎన్నాళ్లయ్యా ఆగేది? పెండ్లికి యిచ్చినబాకీ పిల్లలుకనే ఈడొచ్చినా ఇవ్వలేక పోతే సొమ్ము మీకోసమే సంపాదించి పెట్టామా?"

శేఖరానికి చంప పెట్టయింది. అవమానంతో వళ్లంతా కూలబడి పోయింది— 'ఇంకా నయం. పెళ్ళాంతో పులికేటప్పుడైనా నేను కన్పించనా' అనలేదనుకున్నాడు. ఆ మా టేతల్చుకుని శేఖరం గుండె చెరువు చేసుకున్నాడు. ఏం లాభం? మాటబుదక్కేట్టు లేదు వీధిలో అప్పువాళ్ళతో అభాసుపాలు కావలసి వస్తుందేమో! ఆరాత్రింతా శేఖరం కుమిలిపోయాడు.

* * *

శేఖరం పరిస్థితినంతా తరచి తరచి చూచుకున్నాడు. చీకటి దయ్యంలాంటి వాస్తవం బయటికొచ్చింది. తల్లీ, తండ్రీ, భార్యా తనను అర్థంచేసుకోలేదు. వాళ్ళ

222

సంస్కారానికి అందకుండా ఉన్నవి తన ఆదర్శాలు. నలుగురిలో కలిసి బ్రతకడమే వాళ్లకు కావలసింది. మానవత్వపు విలువలను కొలతలోకి తీసుకోరు. ఇన్నాళ్లబ్రతుకు తూన్న బ్రతుకులో యేచిన్నపాటి మార్పువచ్చినా విలవిలతన్నుకుంటారు. నలుగురిలో స్థాయి దిగజారిపోతుందని వాపోతారు. వాళ్ళకు కావలసింది ఆదర్శాలు కాదు డాంబికంగా హోదాగా నెట్టుకుపోవడం. తనను గురించి వాళ్ళకో అభిప్రాయం ఉంది. కుటుంబాన్ని పోషించలేని నిష్ప్రయోజకుడై పోయాడని ఈసడించుకుంటున్నారు.

తను ప్రయోజకుడు కావాలంటే యేం చేయాలి? ఎలాగో సంపాదించి కుటుంబాన్ని దర్జాగా నడిపించాలి. కానీ అది తనవల్లకానిపని. తన చిన్నాన్నకొడుకు వంశగౌరవం నిలబెట్టాడనీ కాపురాన్ని గట్టెక్కించాడనీ, బుద్ధిమంతుడనీ, ముల్లెకట్టి వెనకేసుకొస్తున్నాడనీ —చుట్టపక్కాలూ. ఊళ్లోని ముసలి తండ్రులు చెప్పుకుంటారు. కానీ వాణ్ణిచూస్తేనే తనకు మలినం తొక్కినంత కంపుకొడుతుంది. ఎవనికైనా దురవస్థ సంభవిస్తే దాని ఆసరాగా వాడు బాగుపడుతాడు. చాకలి చిన్నోడి పెళ్లాం బావిలో పడి ఆత్మహత్య చేసుకున్నది. "హత్యచేసి బావిలో వేశారని పోలీసుకు రిపోర్టుచేస్తా"నని బెదిరించాడు. వాళ్ళ సర్వస్వంగా చూసుకుంటూన్న అరకయెద్దుల నమ్మి చేతిలోపోస్తే ఊరుకున్నాడు. బెల్లం పైసా బెల్లంబాపతు పైసా ఖాతాలో కెక్కించి, వడ్డీకి వడ్డీకట్టి కొండంత అప్పుచేసి మాల శాయన్నకు చూపించాడు. వాడు ఎదురు మాట్లాడితే దావావేసి మరింత దిగద్రొక్కాడు. శరీరంలో ఒకభాగంగా చూచుకుంటున్న వాని పదెకరాల భూమినీ స్వాధీనపరుచుకున్నాడు. సంపాదన కోసం ఎదురైన గడ్డి కరవడమంటే తనకు సరిపడదాయె.

తన పెదనాన్నకొడుకు ఊళ్ళో మందినంతా పిడికిట్లో పెట్టుకుని అడ్డమైన చాకిరీ చేయించుకుంటున్నాడు. ఏదో స్టంటుచేసి పిచ్చిగా వెంటతిప్పుకుంటాడు మందిని. లేనిపోని భ్రమలు కల్పించి ఎటంటే అటె యెగరేపుతాడు. ఎదురు మూలిగిన వాణ్ణి నాలుగు తన్నిస్తాడు. అప్పివ్వకపోతే కొంపలు దోపిస్తానంటాడు. బిగువైన వక్షోజాల ఆకర్షణ కారణంగా భర్తను చంపించి బోయ చిన్నిని సొంతంచేసుకున్నా వీడూ ఒక ప్రయోజకుడే అయిపోయాడు.

తన బావ భార్యకు వశమైపోయి తలిదండ్రుల్ని నిర్దాక్షిణ్యంగా అణచి పెట్టాడు. వాళ్ళ గోల ఎవరితోనైనా చెప్పుకున్నట్లు తెలిస్తే సర్వ ఛండాలంగా తిట్టి నోళ్లు నొక్కవేస్తాడు. పాపమా ముసలాళ్లు యింట్లో బోరుమని యేడ్చినా బయట యే బాధా లేనట్లు బరువుగా తిరుగుతున్నారు.

223

యిస్తానన్నంత వరకట్నం ఇవ్వని కారణంగా నానాఅవస్థలు పెడితే గుండెపగిలి చనిపోయింది కరణంగారి కోడలు.

భార్య అపురూప లావణ్యం బయటపడిపోతే ఎవరైనా అపవిత్రం చేస్తారేమో నన్న అనుమానంతో కిటికీ సందుగుండాకూడా బయటి ప్రపంచాన్ని చూడనివ్వకపోతే విరక్తిచెంది చేదబావిలో దూకి చనిపోయింది శాస్త్రులవారి భార్య.

ఈ ప్రయోజకుల బ్రతుకులోని బండారమంతా తనకు తెలుసు. తాను ఆశిస్తున్నది వ్యక్తి ప్రయోజనంకాదు. సమాజ ప్రయోజనాన్ని సాధిస్తే వ్యక్తి సమస్యలేదనే భావించాడు. ఈ దాహం తీర్చుకోలేక తపించాడు.

పాత క్రొత్తలను ఎంత సమన్వయపరచుకున్నా శేఖరం తండ్రి ఆశలను తీర్చ లేదు. ఆయనేమో అందరిలా తన కొడుకు త్రోవలో పడిపోతాడని భ్రమించాడు. శేఖరం ఒక్కొక్కప్పుడు అతి సాధారణంగా ఆలోచించేవాడు— మనిషి బ్రతకడానికి ఈ బాదరబందీ అంతా ఎందుకు. పూరిపాకవేసుకుని మొగుడూ పెళ్ళాం ఏకాభిప్రాయంతో కష్టిస్తే యెకరా భూమిలో జీవితాన్ని సాఫీగా గడుపుకోవచ్చు. ఏ హంగామా లేకుండా సహజంగా, సాధారణంగా జీవిస్తూ సాంఘిక ప్రయోజనం కోసం కృషి చేయవచ్చు.

వాస్తవ జీవితం అంతా తలక్రిందులు చేసింది. ఆశయాలూ, ఆదర్శాలూ సాంప్రదాయాల సుడిగాలిలో దూదిపింజల్లా యెగిరిపోయాయి గాయపడ్డ లేడిలా ఆత్మ విలపిస్తున్నది. ఈ భిన్న మనస్తత్వాలమధ్య ఇక తను జీవించలేడు.

అప్పుడే శేఖరం ఎక్కడికైనా పారిపోవాలనుకున్నాడు నీచాతి నీచంగా చనిపోవాలనుకున్నాడు. ఉన్నచోటనే అమాంతంగా మాయమైపోవాలనుకున్నాడు. జీవితాంతం వేధించిన నరమానవులందరిపైనా కక్ష తీర్చుకోవాలనుకున్నాడు.

శేఖరం ఈ నిర్ణయానికొచ్చిన మరునాడే శుభలేఖలు వచ్చాయి. మేనకోడలు పెళ్ళి నిశ్చయమైపోయింది. "అయినసంబంధం చేస్తున్నాం. వరకట్నమే పదివేలు. తాహతుకు లోపందాకుండా పెట్టె సామాను చేసుకురమ్మని" ఉత్తరాలు తెచ్చిన మనిషితో ప్రత్యేకంగా చెప్పి పంపించింది అక్కయ్య. ఈ విషయానికి ఏయభ్యంతరమూ తెలుప లేదు. ఇక బండి ఆగదని తనకు తెలుసు.

తల్లీ తండ్రి పెళ్ళికి సిద్ధమయ్యారు. కట్నాలూ, కానుకలూ వాళ్లుకోరిన విధంగా సరిచూచి పంపి చేతులు దులుపుకున్నాడు.

వాళ్ళు వెళ్ళిపోయింతర్వాత ఒక రోజంతా ఏడ్చాడు శేఖరం. కన్నీళ్ళే అతణ్ణి ఓదార్చాయి. అప్పులవాళ్ళు యమభటుల్లా కనిపించారు. తల్లీ, తండ్రీ, భార్యా పెను భూతాల్లా భయపెట్టసాగారు. బ్రతుకును కుదించుకుని స్వారీచేస్తున్నవాళ్ళంతా హేళనగా భయంకరంగా నవ్వుతున్నారు. అప్పుడనుకున్నాడు శేఖరం— 'అన్నీ తెలుసుకుని ఆవేదన పడేవానికన్నా పరిమితంగా తెలుసుకున్నవాళ్ళే మనుష్యుల మార్కెట్లో బాగా చలామణీ అవుతారని.'

కొన్నాళ్ళపాటు మూగబ్రతుకు బ్రతికాడు శేఖరం. ఎవళ్ళతోను మాట్లాడేవాడు కాదు. హృదయంలేని మనుష్యులతో మాట్లాడాలంటే అతనికి హేయంగాతోచేది. అట్లా మాట్లాడకుండా ముఖమడ్డంపెట్టుకుని పగసాధించినట్లు తృప్తిపడేవాడు. అయితే తాను వాళ్ళకు అర్థమై చావద్దూ? వాళ్ల మామూలుగానే కనిపించేసరికి మరింత బెంగ పెట్టుకునే వాడు.

ఆనాడే చావాలని నిశ్చయించుకున్నా ఇప్పటికీ బతికేవున్నందుకు శేఖరం తనను తాను దూషించుకున్నాడు. బ్రతుకులోపడిన ఆరాటమంతా జ్ఞాపకం చేసుకునేసరికి ఎక్కడలేని దుఃఖం ముంచుకొచ్చింది. అవును తానిక బ్రతికి సాధించేదేమీలేదు. చనిపోతే పిరికివాడని దూషిస్తారేమో. బ్రతికి ఉన్ననాడు తన అభిప్రాయాలను గౌరవించలేని వాళ్ల చనిపోయాక యేమనుకుంటే యేం? గుడ్డికన్ను మూసినా తెరిచినా తనకు లక్ష్యంలేదు. లోకమెంత తిట్టిపోస్తే అంత తృప్తిపడుతుంది తన ఆత్మ.

శేఖరానికి చటుక్కున మరికొన్ని దృశ్యాలు స్మృతిపథంలో మెరిశాయి. వెంటనే దానిని మననంచేసుకోకుండా ఉండలేకపోయాడు. బ్రతుకునంతా చివరి క్షణాలలో కళ్ళముందు ప్రతిబింబించుకోడంలో ఆత్మానుభూతులు రాలిపడే నక్షత్రంలా చటుక్కున మెరిసి ఆరిపోతాయి. అస్తమించే సూర్యుడు ఆఖరి కిరణాన్ని భూమినుండి లాక్కున్నప్పుడు కన్పడే దృశ్యంలాంటిదే ఈ పరిస్థితి.

*　　　*　　　*

పుట్టింటికి వెళ్ళి సాలు గడచినా రాలేదు శేఖరంభార్య తను వెళ్ళవలసినఅగత్యం తప్పనిసరిగా ఏర్పడింది. వెళ్ళటంతోనే మూల్లే మూటా సర్దుకొమ్మని భార్యతోచెప్పాడు. ఆతిథ్యానికని రెండు రోజు లుండిపొమ్మన్నాడు మామ. అక్కడ ఉండాలంటే ఎందుకో మనస్కరించలేదు. కుంటి కోడిలా కాలం గడిపాడు.

"మేమూ కోడళ్ళతో కాపురం చేయించుకుంటున్నాం. ఇంత రా[illegible]ంపాన పెట్టేవాళ్ళను చూడలేదు. ఆడదైయుండీ అచ్చట్లూ ముచ్చట్లూ చూడొద్దూ? ఎప్పుడూ

గొడ్డుచాకిరీయేనా?' అత్తగారు తనను అసాంతంచూస్తూ ఆమె ఏమాత్రం కనపడకుండా అంటిస్తున్నది.

ఏ లోకంలోనో ఉన్న శేఖరం ఈ లోకానికి వచ్చాడు. భార్యా, తల్లీ—కుక్కమీద, కోడిమీద పెట్టి తిట్లూ, శాపనార్థాలూ పెట్టుకోవడం తమ యింట్లో ఒక రివాజై పోయింది. ఎన్నోసార్లు ముఖాముఖి చెరిగిపోసుకున్నారు.

"ఆ యింటి ఆడపడుచువై పుట్టాక ఈమాత్రం నిప్పులు పోయకుండా ఉంటావే? తల్లికి బొల్లి, పిల్లకు మచ్చని ఊరికే అన్నారా?'

"ఈ యింటికొచ్చి యింత గొల్లుమనిపించావులే. మా యింటిని వేలుపెట్టి చూపొచ్చావు. మా ఆడపడుచులెవరూ అడుక్కు తినడంలేదు

సాధారణంగా అత్తాకోడళ్ల జగడంలో అటు మూడుతరాలూ ఇటు మూడుతరాలు తూర్పారబట్టుకుంటారు. ఆఖరి తిట్టు తిట్టిన వాళ్ళదే గెలుపుగా గుర్తిస్తారు. అందుకే మనసులో ఉన్న కుళ్ళంతా ఒకరిమీద ఒకరు దుమ్మెత్తిపోసుకోడం కోసం గుప్పించుకుంటారు. దానికి అంతం అంటూ ఉండదు.

"బెల్లంకొట్టిన రాయిలా నిలబడకపోతే దాని నోరు మూయించరాదురా. పెళ్లాన్ని వొంగదీయలేకపోతే ఎందుకు మగసిరి."

"ఆడదాని అతీగతీ పట్టించుకోని వాళ్ళు పెళ్ళీ పెడాకులూ యెందుకు తగలబెట్టుకోవాలి? మీరు కొంచెం కీలు తిప్పితే ఆమె అలా యెగసి పోతుందా?"

అత్తాకోడళ్ళ పోరాటంలో తను ఎవరిని సమర్థించాలో శేఖరానికి తెలియలేదు. ఆలోచించగా ఇరువురి చిత్తప్రవృత్తులూ ఒకటేనని తేలింది. వీళ్ళ వైరుధ్యమంతా ఒకరిపైన మరొకరి ఆధిక్యత పెంచుకోడం కోసం. ఈ ఆడవాళ్ళ మనసులు అతి సంకుచితాలు. కాపురంచేస్తున్న ఇంటి గోడలే వీళ్ళ ప్రపంచానికి హద్దులు. నచ్చిన బట్ట కట్టుకోడం. నాణ్యమైన నగలు ధరించడం, శారీరక వాంఛలు తీర్చుకోడంలో, పిల్లల్ని కనడం, ఏ కష్టం లేకుండా హాయిగా కాలం గడపడం— జీవితమంతా పీటిచుట్టే పరిభ్రమిస్తూంది. వేరే విషయాలు ఏమీ తెలిసి ఉండవు. తెలుసుకోడానికి గూడా ప్రయత్నించరు. స్వల్పమైన వాటి కోసం ఘర్షణ పడుతుంటారు.

226

శేఖరం మొదట్లో భార్యకు మెరుగులు దిద్దాలని ప్రయత్నించాడు. విఫలమై పోయింది.

"ఈ రోజుల్లో చదువుకున్నవాళ్లు పెళ్ళాలను పువ్వుల్లోపెట్టి పూజిస్తున్నారు. ఏ ఉద్యోగమన్నా చూచుకోక ఆ పాడుకాపురం మెడకు తగిలించుకోకపోతే యేం?" ఉద్యోగంచేస్తున్న భర్త ఆలనలో లాలనలో సర్వాంగాలు కోమలంగా పన్నెవారించికొన్న శేఖరం వదినెగారు హితోపదేశం ప్రారంభించింది.

శేఖరానికి చిఱ్ఱుమన్నది. పెళ్లాన్ని సుఖపెట్టడం కోసమని ఆమేరకే జీవితాన్ని పరిమితంచేసుకున్న వాళ్ళంతా ప్రపంచానికేం చేస్తున్నట్లు? సిగ్గులేక కడుపులో చల్ల కదలకుండా బ్రతుకుతూ ప్రపంచానికి ఆదర్శంగా నిల్చిపోవాలని ఆశించే వాళ్ళను వరసగా నిలుచోబెట్టి కాల్చేయాలనిపించింది ఇక నిలువలేకపోయాడు.

"ఇదిగో నేను వెళుతున్నాను. వస్తావా లేదా చెప్పు" పెళ్ళాన్ని నిలదీసి అడిగాడు.

"ఎందుకూ? మీ అమ్మతో చీపురు దెబ్బలు తినడానికా? మీరేమన్నా ఆ రొంపిలోనికి మాత్రం నేను రాను." అన్నది భార్య. ఆమె విజ్ఞానం ఆమెతో అంతకన్న ఏమనిపిస్తుంది?

శేఖరం ఇక అక్కడ నిలవలేదు. ఇంటికిరాగానే తల్లీ తండ్రీ ఎంత అడిగినా సమాధానం చెప్పలేదు. అతని నరాల్లో అగ్ని కాగడాలు మండుతున్నాయి. ఆరోజు నుంచే శేఖరానికి జీవితం దుర్భరమైపోయింది. ఎవళ్ళకీ ముఖం చూపెట్టకుండా ఇంట్లోనే కుళ్ళిచస్తున్నాడు.

ఆఖరిసారిగా శేఖరం ఇలా అనుకున్నాడు. తల్లీ, తండ్రీ, భార్యా తన ప్రమేయంలేకుండా హాయిగా ఉన్నారు. వాళ్ళకోసం అనవసరంగా తను బాధపడుతున్నాడు. ఇక సాధించేదేమీలేదు వ్యక్తిత్వాన్ని చంపుకుంటేనే వీళ్ళ ఆదరణ లభించేది. కుటుంబంలో ఏ ఒక్కరూ తనతో ఏకీభవించలేరు. పోనీ వాళ్ళైనా సన్నిహితంగా ఉన్నారా అంటే అదీ లేదు. ఒకరి నొకరు సానుభూతితో పరిశీలించుకోలేక పోతున్నారు— వాస్తవ జీవితంలో పడిన అగచాట్లను తలుచుకుని భోరున ఏడ్చాడు

శేఖరం జ్ఞాపకాలన్నీ సమాప్తమయి పోయాయి. గతం నుండి ప్రస్తుతానికి వచ్చాడు. నికృష్టంగా, నీచంగా, హీనంగా, దీనంగా, దిక్కులేని విధంగా ఘోరమైన చావుచచ్చి తనవాళ్ళను ఏడ్పించాలనుకున్నాడు. తన చావు జీవమున్న ప్రతివస్తువునూ ఏడ్పించేటంత దారుణంగా విషాదంగా ఉండాలనుకున్నాడు.

చీకటి పడింది. తల్లి భోజనానికి రమ్మంటే పలకలేదు శేఖరం.

శేఖరం అలకను గురించి అమ్మలక్కలు "ఆ ముసలాళ్ళతో తెగదెంపులు చేసుకుని పెళ్లాంతో వేరే కాపురం పెట్టదలచుకున్నాడు తీయవే. అత్తగారు ఆ మాత్రం నూరిపోయకుండా ఉన్నారా?" అని వ్యాఖ్యానించారు.

శేఖరం తల్లీ, తండ్రీ కూడా అనుకున్నారింతే. గోలచేసి లేపి ఎదోటి తేల్చేద్దామని గదిలోకి వెళ్ళారు, ఆశ్చర్యంగా బయటికి వచ్చారు.

* * *

ఆటవిక జాతిని జాగృతపరిచే కార్యకలాపాల్లో జీవిస్తున్నట్లు—రెండేళ్ళ తర్వాత శేఖరాన్ని గూర్చినసమాచారం తెలిసింది. అంతా విస్తుపోయి తెల్లమొఖాలు వేసుకున్నారు.

"అర్థశాస్త్ర సూత్రాల్ని బుద్ధితోగాక శరీరంతోనే గ్రహించేను. ఈ ప్రపంచంలో అధిక సంఖ్యాకుల పరిస్థితి నాకంటే భిన్నమైనదిగా లేనప్పుడు పెద్ద పెద్ద పుస్తకాల్ని ఎవరికీ తెలియని మాటలతో రాయడంలో ప్రయోజనం నాకేమీ కనిపించదు. ఇంకోడికి లాభాల్నీ, సుఖాన్నీ చేకూర్చడంలో తన శక్తిని ధారపోసేవాళ్లకి స్పష్టంగా కనిపించే సిద్ధాంతాలు బోధించడానికి రాసిన ఈ పుస్తకాలుచూస్తే, ముంజేతి కంకణానికి అద్దమెందుకు? అన్న సామెత ఊరికే పుట్టలేదని తెలుస్తుంది."

— మాగ్జిం గోర్కీ